క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పులివెందుల రూరల్ : పట్టణంలోని బైపాస్ రోడ్డు విస్తరణకు సంబంధించి కరెంట్ లైన్ షిఫ్టింగ్ పనులు జరుగుతున్న సందర్భంగా సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ జగదీశ్వరరెడ్డి తెలిపారు. పట్టణ ప్రజలు, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

నేడు మండల సమావేశం

పులివెందుల రూరల్ : పట్టణంలోని మండల సభా భవనంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ దివాకర్ తెలిపారు. సమావేశంలో గ్రామాలలో నెలకున్న సమస్యలపైన, తాగు నీటి సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన చర్యలు గురించి చర్చించడం జరుగుతుందన్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు, అన్నిశాఖల అధికారులు హాజరు కావాలన్నారు.

కస్టమర్లతో స్నేహపూర్వకంగా మెలగాలి



రెస్టారెంటును ప్రారంభిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

వేంపల్లె : రెస్టారెంట్‌కు వచ్చే కస్టమర్లతో స్నేహపూర్వకంగా మెలగాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తెలిపారు. ఆదివారం కడప–పులివెందుల బైపాస్‌రోడ్డులో గంగాధర్‌రెడ్డి, ప్రసాదొరెడ్డిలు ఏర్పాటు చేసిన ఫ్రెండ్స్ ఫ్యామిలీ రెస్టారెంట్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రెస్టారెంట్‌కు వచ్చే కస్టమర్లతో మంచిగా ఉండి వారికి సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చంద్రఓబుల‌రెడ్డి, సర్పంచ్ ఆర్.శ్రీనివాసులు, వైఎస్సార్ సీపీ నాయకులు రుద్ర భాస్కర్‌రెడ్డి, కటిక చంద్రశేఖర్‌రెడ్డి, మజీగోపాల్‌రెడ్డి, భారతీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవారికి బోనాలు

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : మైలవరం మండలం నార్జంపల్లె గ్రామంలో అమ్మవారి జాతరను భక్తులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం పెద్దమ్మతల్లికి ఉదయమే భక్తులు బోనాలు పెట్టుకున్నారు. గ్రామంలో 21 సంవత్సరాల తరువాత పెద్దమ్మతల్లి జాతర నిర్వహిస్తుండటంతో గ్రామంలో ఏటు చూసినా సందడి నెలకొంది. పోలీస్ అధికారులు ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. జాతర సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మూలే సుధీర్‌రెడ్డి హాజరై పెద్దమ్మతల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వైభవంగా గంగమ్మ జాతర



ప్రత్యేక అలంకారంలో గంగమ్మతల్లి

చెన్నూరు : స్థానిక బస్టాండ్ సమీపంలో పీర్ల చావిడి వద్ద ఆదివారం నిర్వహించిన గంగమ్మ పెద్దమ్మ జాతరకు పెద్ద ఎత్తున భక్తులు పోటెత్తారు. శనివారం అర్ధరాత్రి నుంచి ప్రారంభమైన జాతర మహోత్సవం గోల పుల్లయ్య వీధిలో అమ్మవార్లను ఊరేగించారు. మహిళలు పెద్ద ఎత్తున బోనాలు సమర్పించారు. భక్తులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా మజ్జిగ మంచినీరు కమిటీ నిర్వాహకులు ఏర్పాటు చేశారు. సీఐ పార్థసారథి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

నివాళి

జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగు తాలూకా పెన్నెనర్ సంఘం గౌరవ అధ్యక్షుడు పొన్నారి దస్తగిరి మృతి చెందడం చాల బాధాకరమని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పొన్నారి దస్తగిరి కర్నూల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందడంతో ఎమ్మెల్యే ఆయన భౌతికాయానికి పూలమాల వేసి నివాళులు అర్పించి అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పరామర్శ



శ్రీనువాసులు చిత్ర పటానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్

పెండ్లిమర్రి : మండలంలోని యాదవాపురం గ్రామానికి చెందిన ఆదిమూలం శ్రీనువాసులు ఈనెల 2వ తేదీన హత్యకు గురైయ్యాడు. మృతుని కుటుంబ సభ్యులను ఆదివారం ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, వైఎస్సార్‌సీపీ బీసీ నాయకుడు బంగారు నాగయ్యలు పరామర్శించి మృతుని చిత్ర పటానికి నివాళి అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడారు. కుటుంబానికి అండగా ఉండి తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనువాసులు, వైఎస్సార్‌సీపీ నాయకులు నారాయణ, సాంబశివుడు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి



పెద్దపసుపుల గ్రామంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి



పులివెందులలో ఓట్లు అభ్యర్థిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి, తదితరులు

పెద్దముడియం : ప్రజా సంక్షేమం, అభివృద్ధికి సమానంగా ప్రాధాన్యతనిస్తూ పాలన సాగించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని పెద్దపసుపుల గ్రామంలో వారు మార్కెట్ యార్డు చైర్మన్ పి.వి.రమణారెడ్డి గారితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వీరికి గ్రామ ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఐదేళ్ల పాలనలో గ్రామంలో జరిగిన అభివృద్ధిని, ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. ఇంటింటికి వెళ్లి ఫ్యాను గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను, ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఎంపీ అవినాష్‌రెడ్డి గారిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమానికి, అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిలిచిందన్నారు. మీకు మేలు జరిగింటేనే ఓటు వేయండని డైరెక్టుగా ప్రజలను కోరిన ఏకైక సీఎం వైఎస్ జగన్ అని అన్నారు. ప్రతి కుటుంబానికి సీఎం జగన్ మేలు చేసినందునే ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని, ఓర్వలేక టీడీపీ బ్యాచ్ పనిగట్టుకుని బురదజల్లుతుందని మండిపడ్డారు. వలంటీర్లు అందిస్తున్న నిస్వార్థ సేవలను అడ్డుకునేందుకు కుట్రలు పన్నిన చంద్రబాబుకు పింఛన్ దారులు పడుతున్న ఇబ్బందులు కనిపించడం లేదని ధ్వజమెత్తారు. పింఛన్ కోసం వృద్ధులు, దివ్యాంగులు సచివాలయాలకు వచ్చేందుకు పడరానిపాట్లు పడుతున్నారని. పింఛన్‌దారుల తిరుగుబాటును రానున్న ఎన్నికల్లో చంద్రబాబు చవిచూస్తారన్నారు. కార్యక్రమంలో పద్మనాభరెడ్డి, మధుసుదన్ రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, శ్రీనువాసులరెడ్డి, సర్వేష్‌రెడ్డి, శ్రీరాముడు, బాబురెడ్డి, చిన్న రాంపుల్లారెడ్డి, శివారెడ్డి, నాగేష్‌రెడ్డి, ఆలీబాబా, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనవైపే ప్రజలు

పులివెందుల టౌన్ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజల కోసం అందించిన సంక్షేమ పాలన వైపే ప్రజలు మొగ్గుచూపుతున్నారని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మారుతీహాల్ రోడ్డు, నెహ్రూనగర్, పార్నపల్లె రోడ్డు, శ్రీరామా ఆయిల్ వీధి, రాజ్యలక్ష్మిహాల్ రోడ్డు తదితర ప్రాంతాల్లో ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అసెంబ్లీకి పోటీ చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, పార్లమెంటుకు పోటీచేస్తున్న వైఎస్ అవినాష్‌రెడ్డికి మీ అమూల్యమైన రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేసి, వేయించి భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలే ఆయనను మళ్లీ సీఎంగా నిలుపుతాయన్నారు. రాష్ట్ర ప్రజలు ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసేందుకు ఎదురు చూస్తున్నారన్నారు. ప్రజలు ప్రతి ఒక్కరు మీ ఓటుతో పాటు ఇతరులతో కూడా జగనన్న సంక్షేమ పాలనను వివరిస్తూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయించాలని అభ్యర్థించారు.

మళ్లీ మంచిరోజులు వస్తాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, సివిల్‌సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాల్ గంగాధరరెడ్డి, మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ చిన్నప్ప, 22వ వార్డు కౌన్సిలర్ లక్ష్మిప్రసన్న, జేసీఎస్ ఇన్‌చార్జి పార్నపల్లి కిశోర్, చంద్రమౌళి, నూరుబాషా సంఘ రాష్ట్ర చైర్మన్ రసూల్, కోఆప్షన్ చంద్రమౌళి, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డేనియల్‌బాబు, కౌన్సిలర్లు కోడి రమణ, రంగనాయకులు, రాము, సిద్దయ్య, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్త రవికుమార్, బలిజ సంఘ నాయకులు సోపాలవీరా, వైఎస్సార్‌సీపీ నాయకులు కొంగనపల్లె మురళి, పద్మనాభరెడ్డి, శ్రీరామసుబ్బయ్య, రమేష్, ఖాండ్‌బాషా, మస్తాన్‌వల్లి, నాగరాజు, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

తొండూరులో..

తొండూరు : రాష్ట్రంలో మళ్లీ జగన్ ప్రభుత్వాన్ని తెచ్చుకుని రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేసుకుందామని.. సువర్ణపాలన జగన్‌తోనే సాధ్యమని తొండూరు మండల ఇన్‌చార్జి వైఎస్ మధురెడ్డి, మండల అధ్యక్షుడు రవీంద్రారెడ్డిలు తెలిపారు. ఆదివారం సైదాపురం గ్రామంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. వచ్చే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, వైఎస్ అవినాష్‌రెడ్డిలను అఖండ మెజార్టీతో గెలిపించుకుందామని ఆయన ప్రజలను కోరారు. ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించుకుని మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర డైరెక్టర్ సురేష్ రెడ్డి, సర్పంచ్ ఆదర్శ ఓబుల్రెడ్డి, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ నాగేశ్వర్రెడ్డి, చక్రాయపేట మండలం సమన్వయకర్త ఓబుల్రెడ్డి, రాష్ట్ర డైరెక్టర్ రవీంద్రారెడ్డి, శంకర్ రెడ్డి, మండల పరిశీలకుడు రామ మునిరెడ్డి, వేముల జడ్పీటీసీ బయపురెడ్డి, మండల ఉపాధ్యక్షుడు వేణుగోపాల్ రెడ్డి, తాలూకా కార్యదర్శి దశరథ రామిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ రజనీకాంత్ రెడ్డి, సైదాపురం వైఎస్సార్‌సీపీ నాయకులు భరత్ రెడ్డి, అమరేశ్వర్ రెడ్డి, జగన్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తొండూరు : ఓట్లు అభ్యర్థిస్తున్న వైఎస్ మధురెడ్డి, తదితరులు



చక్రాయపేటలో ఫ్యాన్ గుర్తుకు ఓట్లేయాలని ప్రజలను కోరుతున్న వైఎస్ కొండారెడ్డి



ఎర్రగుంట్లలో ప్రజలతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ ఎం హర్షవర్ధన్‌రెడ్డి

చక్రాయపేటలో..

చక్రాయపేట : ఫ్యాన్ గుర్తుకు ఓట్లేసి ముఖ్యమంత్రి జగనన్నను, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని మండల ఇన్ చార్జి వైఎస్ కొండారెడ్డి ప్రజలను కోరారు. ఆదివారం ఆయన దళితవాడ, గడ్డంవారిపల్లెల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మోసాల బాబుకు ఓట్లేస్తే అభివృద్ధి ఉండదని సంక్షేమ పథకాలు రావన్నారు. ఓట్లకోసం చంద్రబాబు ఆయన తొత్తులు చెప్పే మాయ మాటలను నమ్మొద్దన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఎంపీపీ మాధవీబాలకృష్ణ, జడ్పీటీసీ శివప్రసాదరెడ్డి, సర్పంచ్ లక్ష్మమయ్య, ఎంపీటీసీ గంగిరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు శేషారెడ్డి, మాజీ సర్పంచ్ రఘునాథరెడ్డి, మాజీ ఎంపీటీసీ సుబ్బిరెడ్డి, మండల వ్యవసాయ కమిటీ చైర్మన్ వీరశేఖరరెడ్డి, వాసుదేవరెడ్డి, జయ చంద్రారెడ్డి, సూరి, బయారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : రాష్ట్రంలో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కొనసాగాలంటే ప్రతి ఓటరు ఫ్యాను గుర్తుకు ఓటు వేసి ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డిలను గెలిపించాలని మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి ప్రజలను కోరారు. ఆదివారం పట్టణంలోని 1, 2 వార్డులలోని అంబేడ్కర్ కాలనీ, ప్రకాశ్‌నగర్ కాలనీలలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడారు. ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీని ఆశీర్వాదించాలని కోరారు. ఇంటింటికి తిరుగుతూ అభివృద్ధి, సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వజ్రా డెవిడ్, ప్రశాంత్, ప్రతాప్, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు సుందరయ్య కాలనీలో..

పట్టణంలోని మూడవ వార్డులోని సుందరయ్య కాలనీలో సోమవారం సాయంత్రం మున్సిపల్ చైర్మన్ మూలె హర్షవర్ధన్‌రెడ్డి ఎన్నికల ప్రచారం చేయనున్నారని పార్టీ నాయకులు తెలిపారు.

శిల్పారామంలో సాంస్కృతిక ప్రదర్శనలు



కోలాటం ఆడుతున్న చిన్నారులు

పులివెందుల టౌన్ : స్థానిక శిల్పారామంలో ఆదివారం సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. శిల్పారామం పరిపాలనాధికారి సుధాకర్ ఆధ్వర్యంలో యువరాజా డ్యాన్స్ స్కూల్ మాస్టర్ యువకిషోర్ వారి శిష్య బృందంచే కోలాటం, జానపద, వెస్ట్రన్ నృత్యప్రదర్శలు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. శిల్పారామం సందర్శకులతో కిటకిటలాడింది.

దివ్యాంగులకు నిత్యావసర సరకులు వితరణ



దివ్యాంగులకు నిత్యవసర సరుకులు పంపిణీ చేస్తున్న కుటుంబ సభ్యులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని ముత్యాలవారి వీధిలో ఆరుదశాబ్దాలుగా దస్తావేజు లేఖకునిగా, రిజిస్ట్రేషన్ స్టాంపుల విక్రేతగా ప్రజలకు విశిష్ట సేవలు అందించిన అరిగెల తిరుపతయ్య ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని వారి కుటుంబ సభ్యులు ఆదివారం పుల్లారెడ్డి ఆసుపత్రి సమీపంలోని వికలాంగుల కమ్యూనిటీ భవనంలో దివ్యాంగులకు నిత్యవసర సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వికలాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు రఘునాథరెడ్డి, కార్యదర్శి వెంకటసుబ్బయ్య, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు వేసవిలో పెనుగాలుల భయం



సాగులో అరటి పంట

పులివెందుల రూరల్ : రైతులకు వేసవి వచ్చిందంటే గుండెల్లో దడ పుడుతుంది. ప్రతి ఏడాది వేసవిలో పెనుగాలులు రావడం సహజం. ఏప్రిల్ నుంచి మే మొదటి వారంలోపు వడగాల్పులు, పెనుగాలులు విరుచుక పడతాయోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. గతంలో వచ్చిన భయంకర పెనుగాలుల వల్ల అరటి తోటలు నెలమట్టం అయ్యాయి. ప్రస్తుతం పులివెందుల ప్రాంతంలో అరటిసాగు వీస్తర్ణం వివరాలు ఇలా ఉన్నాయి. పులివెందుల నియోజకవర్గ పరిధిలోని చక్రాయపేట మండలంలో తప్ప అన్ని మండలాల్లో అరటి సాగు అవుతోంది. కృష్ణ జలాలు రైతులకు అందుబాటులో ఉన్న కారణంగా అరటి సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు.

వైఎస్ అవినాష్‌రెడ్డిపై షర్మిల ఆధారాల్లేని ఆరోపణలు

మైదుకూరు: మాజీ వివేకానందరెడ్డి హత్య విషయంలో వైఎస్ షర్మిల అవినాష్‌రెడ్డిపై ఆధారాల్లేని ఆరోపణలు చేస్తున్నారని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి విమర్శించారు. ఆదివారం ఆయన స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ చీమకైనా హాని తలపెట్టని వైఎస్ అవినాష్‌రెడ్డి చట్టానికి వ్యతిరేకంగా ఎలాంటి పనిచేయరని పేర్కొన్నారు. ఎంపీగా 2019లో అవినాష్‌రెడ్డి పోటీ చేసినప్పుడు వివేకానందరెడ్డి ఆయన గెలుపు కోసం ముమ్మరంగా ప్రచారం చేశారని తెలిపారు. అవినాష్‌రెడ్డి గెలుపు కోసం వివేకానందరెడ్డి అహర్నిశలు కృషి చేశారని, అందుకు తానే సాక్ష్యమని గుర్తుచేశారు. వివేకానందరెడ్డి ప్రచార కార్యక్రమాలకు సంబంధించిన ఫొటోలను ఈ సందర్భంగా ఎమ్మెల్యే రఘురామిరెడ్డి చూపించారు. వివేకానందరెడ్డిని అవినాష్‌రెడ్డి చంపించి ఉంటే స్థానికంగా ఎందుకు ఉంటారని ప్రశ్నించారు. పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, వివేక కుమార్తె సునీత ఆధారాలు లేని వ్యాఖ్యలు చేయడం సబబు కాదని హితవుపలికారు. వివేకా హత్య జరిగినప్పుడు ఆదినారాయణరెడ్డి మంత్రిగా, చంద్రబాబు ముఖ్యమంత్రిగా అధికారంలో ఉన్నారని, కేసును సీబీఐకి అప్పగించి విచారణ చేయించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోరారని గుర్తు చేశారు.

సమాజ శ్రేయస్సే కవుల లక్ష్యం

కడప కల్చరల్ : కవులు సమాజ శ్రేయస్సును కాంక్షిస్తారని, ఉత్తమ సమాజం ఎలా ఉండాలో సూచిస్తారని, నైతిక విలువలతో కూడిన సమాజం ఆరోగ్యకరమైనదని భావిస్తారని యోగి వేమన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎన్.ఈశ్వర్‌రెడ్డి అన్నారు. రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం మునిరావు వీధిలోని సంస్థ కార్యాలయంలో ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్దన్‌రాజు ఉగాది కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ ముందస్తు వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన ఆచార్య ఎన్.ఈశ్వర్‌రెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ కవులు సమాజానికి దిశా నిర్దేశనం చేయగలరని, నిరంతరం సమాజ శ్రేయస్సు కోసమే తపిస్తారన్నారు. సంస్థ ప్యాట్రన్ పద్మప్రియ చంద్రారెడ్డి మాట్లాడుతూ రాయలసీమ టూరిజం సంస్థ సాంస్కృతిక విభాగం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని, సంప్రదాయమైన పండుగలన్నింటినీ మతాలకు అతీతంగా నిర్వహిస్తున్నదని తెలిపారు.

ఘనంగా ముద్దల పండుగ



కోగటంలో పూజలు చేస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

కమలాపురం : గంగమ్మ.. మమ్మల్ను చల్లగ చూడవమ్మా అంటూ భక్తులు స్థానిక మార్కెట్ వీధిలో వెలసిన శ్రీ గంగమ్మ తల్లిని వేడుకున్నారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం గంగమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పలు ప్రాంతాల నుంచే కాక సమీప ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులు గంగమ్మకు బోనాలు తీసుకొచ్చి చల్ల ముద్దలు ఏర్పాటు చేసి, జంతు బలులు ఇచ్చి తమ మొక్కులు తీర్చుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, పాడి పంటలు ఇంటికి చేరి ప్రజలందరూ సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని మహిళా భక్తులు గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే కోగటం, కె.అప్పాయపల్లె, జీవంపేట, పెద్దచెప్పలి, చిన్నచెప్పలి, పొడదుర్తి, ఎర్రబల్లె, నల్లింగాయపల్లె, పందిళ్లపల్లె, ఎర్రగుడిపాడు, సంబటూరు, జంభాపురం తదితర గ్రామాలలో ప్రజలు ఘనంగా ముద్దల పండుగ చేసుకున్నారు. బంధువులు, సన్నిహితులకు విందు భోజనాలు ఏర్పాటు చేశారు. దీంతో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది.

కోగటంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పూజలు : కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కోగటంలో పూజలు నిర్వహించారు. కోగటం గ్రామంలో నిర్వహించిన ముద్దల పండుగకు ఎంపీ హాజరయ్యారు. గంగమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీ అవినాష్‌రెడ్డి మామ ప్రతాప్‌రెడ్డి, స్టేట్ హార్టికల్చర్ అడ్వైజర్ సంబటూరు ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొలిమి దగ్ధం



వేంపల్లె : స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల పక్కన వ్యవసాయ పనిముట్లను తయారుచేసే కొలిమి ఆదివారం అగ్నికి దగ్ధం అయింది. దీంతో రెండున్నర లక్షలమేర ఆస్తి నష్టం జరిగింది. బాధితుడు ఖాజాహుస్సేన్ తెలిపిన వివరాల మేరకు... వ్యవసాయ పనిముట్లకు సంబంధించి వివిధ రకాల పనిముట్లను తయారు చేసేందుకు యంత్రాన్ని అమర్చుకున్నట్లు తెలిపారు. శనివారం రోజు మాదిరే తాము పనులను ముగించుకుని ఇంటికి వెళ్లామన్నారు. ఆదివారం కూలీలు రానందున తమ కొలిమికి తాళాలు వేశామని తెలిపారు. ఈక్రమంలో పక్కనే మలమూత్రాలకు వెళ్లే ఆకతాయిలు చెత్తాచెదారాలకు నిప్పుపెట్టడంతో ఈ సంఘటన జరిగి ఉంటుందన్నారు. స్థానికులు గమనించి ఫైర్ స్టేషన్‌కు ఫోన్ చేశారు. ఫైర్ సిబ్బంది మంటలు ఆర్పకముందే వ్యవసాయ పనిముట్లకు సంబంధించి కొయ్యలు, యంత్రాలు, బ్లోయర్, విద్యుత్ సామాన్లు బూడిదయ్యాయి. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరారు.

కనుల పండువగా కల్యాణోత్సవం

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం మాస శివరాత్రి సందర్భంగా అగస్త్యేశ్వరస్వామి, రాజరాజేశ్వరి అమ్మవారికి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేకువజామున స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారికి కుంకుమార్చన చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం గణపతి, నవగ్రహ, రుద్రహోమాలు నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. సాయంత్రం గంగారాజరాజేశ్వరి సమేత అగస్త్యేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను సుందరంగా అలంకరించి కాలక్షేప మండపంలోని వేదికపై ఆశీనులు చేశారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య వైభవంగా కల్యాణం జరిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు భస్మహారతి

అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో సోమవారం అమావాస్య సందర్భంగా స్వామివారికి ప్రదోశకాలంలో ఉజ్జయిని మహాకాళేశ్వరుని వలే పూజా, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం, సాయంత్రం 5.30 గంటలకు భస్మహారతి నిర్వహిస్తారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని కొత్తమిద్దె రఘురామిరెడ్డి కోరారు.

ఆరోగ్య ‘ఫలం’.. ఖర్జూరం

- రంజాన్ మాసంలో విస్తృత వినియోగం

కడప కల్చరల్ : పవిత్ర రంజాన్ మాసం గురించి తలుచుకోగానే ఖర్జూరపు పండు గుర్తుకు వస్తుంది. ఈ మాసంలో ఈ పండుకు గల ప్రాముఖ్యత అంతా ఇంతా కాదు. చూడగానే నోరు ఊరించే ఈ పండుకు అంతటి ప్రాధాన్యత ఎందుకు ఇస్తారో ముస్లిమేతరుల్లో చాలా మందికి తెలియదు. ఆహారానికి కులం, మతం ఉండదు గనుక ప్రకృతి ప్రసాదితమైన ఈ పండు గురించి అందరూ తెలుసుకోవచ్చు. పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా అమృతఫలం ఖర్జూరం గురించిన కొన్ని వివరాలు...

ఎన్నో పోషకాలు గల ఫలం ఖర్జూరం. ప్రాచీనకాలం నుంచి ఆహార పదార్థాల్లో ఈ ఫలానికి ప్రత్యేక స్థానముంది. ఇస్లామిక్ సంప్రదాయ ఆహార పదార్థాలలో ఖర్జూరానికి పెద్దపీట వేశారు. మహా ప్రవక్త మహమ్మద్ (సా.అ.వ) ఈ ఫలాన్ని ఎంతో ఇష్టపడేవారు. దాదాపు తేనెలాంటి రుచితోపాటు ఇందులో అన్ని రకాల పోషకాలు ఉండడంతో దీనికి అంతటి ప్రాధాన్యత లభిస్తోంది. అందుకే రంజాన్ మాసంలో రోజా (ఉపవాసం) దీక్ష విరమణలో ఈ ఫలం తప్పక ఉపయోగిస్తారు. ఈ పండుతో దీక్ష విరమించడం పుణ్యాదాయకమని ముస్లింలు భావిస్తే, అంతేగాక దీనివల్ల పరిపూర్ణ ఆరోగ్యంతోపాటు శరీర సౌందర్యం కూడా పెరుగుతుందని అరబ్బులు విశ్వసిస్తారు.

అద్భుతం

ఖర్జూరంలో ఎన్నో పోషకాలు, ఔషధ గుణాలు ఉన్నాయి. ఆహార నిపుణులు, వైద్యులు కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించారు. ఇందులో గ్లూకోజ్, ఫ్రక్టోజ్ లాంటి ప్రకృతి సిద్ధమైన చక్కెర పదార్థాలు ఉండడంతో త్వరగా జీర్ణమై శరీరానికి తక్షణ శక్తినిస్తాయి. ఈ పండులో గుండెజబ్బును తగ్గించే గుణం కూడా ఉంది. రోజూ కొన్ని ఖర్జూరపు పండ్లను నానబెట్టి ఉదయాన్నే తింటే ఆరోగ్య సమతుల్యత ఏర్పడుతుంది. మలబద్ధకం సమస్య ఉన్న వారికి ఈ పండు మందులా ఉపయోగపడుతుంది. రోజూ ఖర్జూరాలు తింటే ప్రేవులు, జీర్ణకోశ, కాలేయ వ్యాధులు, నులి పురుగుల సమస్య ఉండదు.

శక్తివంతం

ఈ పండు సులభంగా జీర్ణమవడమే కాక శరీరానికి



మంచి శక్తినిస్తుంది. పాలలో ఈ పండు గుజ్జును కలిపి ఇస్తే హెల్త్ డ్రింక్‌లా పని చేస్తుంది. బలహీనంగా ఉన్న వారు వేడి పాలలో వాడితే శరీర పుష్టి, ఆరోగ్యం చేకూరతాయి. స్త్రీలకు మంచి పోషకాహారం. రోజూ నాలుగు ఖర్జూరాలు క్రమం తప్పక గ్లాసు పాలతో తీసుకుంటే మంచిది. అంత స్థోమత లేని వారు కేవలం నాలుగు ఖర్జూరాలు తిన్నా సమతుల ఆహారం తీసుకున్నట్లే. ఖర్జూరం పండులో ఎన్ని ఔషధ గుణాలు ఉన్నాయో దాని గింజలో కూడా అంతే ఔషధ గుణాలు ఉన్నాయి. ఈ గింజల పొడిని వెన్నెలో కలిపి తింటే గుండె జబ్బులు రావని ఆహార నిపుణులు పేర్కొంటున్నారు. నేరుగా చెట్టు నుంచి కోసుకుని అప్పటికప్పుడే తింటే ఈ పండు ఎంతో రుచిగా ఉంటుంది. వీటిని అలా పోసి నిల్వ చేస్తే త్వరగా చెడిపోతాయి. పండ్లలోని నీరు ఇగిరిపోయేలా ఎండలో ఉంచుతారు. దాంతో ఆ పండ్ల బరువు 35 శాతం తగ్గుతుంది. ఈ పండ్లు ఎక్కువగా తింటే వేడి చేస్తుందన్న భావన ప్రజల్లో ఉంది. కానీ ఇది కేవలం అపోహ మాత్రమే. దీనిని వేసవిలో కూడా.. ఇంకా చెప్పాలంటే సీజన్‌తో సంబంధం లేకుండా లభిస్తుంది.

100 గ్రాముల ఖర్జూరంలో..

315 క్యాలరీల శక్తి
5.3 శాతం నీరు
2.5 శాతం ప్రొటీన్లు
0.4 శాతం కొవ్వు
75.8 శాతం కార్బొహైడ్రేట్స్
120 మిల్లీ గ్రాముల క్యాల్షియం
50 మిల్లీ గ్రాముల పాస్ఫరస్
7.3 మిల్లీ గ్రాముల ఐరన్
మూడు మిల్లీ గ్రాముల సి–విటమిన్